

జహీరాబాద్‌లో సాగవుతున్న శనగ

# లాభాల 'మార్పిడి'

- పంట మార్పిడితో ఆరుతడి పంటలు సాగు
- యాసంగిలో తెల్లజొన్న, శనగ, ఆలుగడ్డ సాగు వైపు మళ్లిన రైతులు
- జహీరాబాద్‌లో పెరిగిన పంటల సాగు

జహీరాబాద్, డిసెంబర్ 1: యాసంగిలో అన్నదాతలు అధిక దిగుబడులు సాధించేందుకు ఆరుతడి పంటలు సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. పంటమార్పిడి పాటిస్తున్నారు. యాసంగిలో రైతులు ఎక్కువగా వర్షాధారంగా పడే చిరుధాన్యాల పంటలు సాగు చేస్తున్నారు. ఆరుతడి పంటలుగా చిరుధాన్యాలను వ్యవసాయ బావులు, బోర్ల వద్ద సాగు చేస్తున్నారు. కొందరు రైతులు యాసంగిలో తెల్లజొన్న, గోధుమ, ఆలుగడ్డ, శనగతోపాటు ఇతర పంటలు సాగు చేస్తున్నారు. జహీరాబాద్ డివిజన్‌లో రైతులు అధికంగా ఈ ఏడాది చిరుధాన్యాల పంటలు సాగు చేస్తున్నారు. మార్కెట్‌లో తెల్ల జొన్నలకు భారీగా డిమాండ్ ఉండడంతో రైతులు పత్తి పంటను తీసి ఆరుతడి పంటలు సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. జహీరాబాద్, కోహీర్ మండలంలో రైతులు అధికంగా ఆలుగడ్డ సాగు చేస్తున్నారు. మొగుడంపల్లి, ఝరాసంగం, న్యాల్‌కల్, కోహీర్ మండలంలో తెల్లజొన్న, గోధుమ, శనగతో పాటు ఇతర పంటలు సాగు చేస్తున్నారు.

**అత్యధికంగా తెల్లజొన్న, శనగ**



జహీరాబాద్ ప్రాంతంలో రైతులు సాగు చేస్తున్న తెల్లజొన్న

రైతులు వానకాలంలో అధికంగా పత్తి పంటను సాగు చేశారు. ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. రైతులకు తీవ్ర పంట నష్టం జరిగి దిగుబడి తగ్గిపోయింది. కొందరికి పెట్టిన పెట్టుబడులు రాని పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతులు పత్తి పూత, కాయ దశలో ఉన్న సమయంలోనే పత్తిని తొలగించి జొన్న, శనగ పంటను సాగు చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో రైతులు పత్తి పంటను తీసి ఆలుగడ్డ వేశారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలు సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. గతేడాది కంటే యాసంగి సాగు పెరగనుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. పంట దిగుబడులు పెంచేందుకు రైతులు కొత్త పద్ధతిలో పంటలు సాగు చేస్తున్నారు. కొందరు రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు జొన్న, శనగ, తదితర పంటకు నీటి తడులు అందిస్తున్నారు.

## యాసంగి సాగు పెరుగుతున్నది



యాసంగిలో రైతులు ఆరుతడి పంటలు సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. వాణిజ్య పంట సాగును తగ్గించుకొని ఆరుతడి పంటలైన జొన్న, శనగ, ఆలుగడ్డ సాగు చేసేందుకు మొగ్గు చూపారు. ఈ పంటలకు మార్కెట్‌లో మంచి ధర ఉందని, దీంతో రైతులు సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఆరుతడి పంటలు సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నది. జహీరాబాద్ డివిజన్‌లో యాసంగి పంటల సాగు పెరిగింది.

**- భిక్షపతి, ఏడీఏ, జహీరాబాద్**

# అంతా గప్‌చుప్

- మూగబోయిన పల్లెలు
- తగ్గిన ఎన్నికల హడావుడి
- నెలరోజుల సందడికి బ్రేక్
- ఎవరిని తట్టినా అభ్యర్థుల గెలుపోటములు, మెజార్టీపై చర్చ
- ఇండ్లకే పరిమితమైన నాయకులు, కార్యకర్తలు



హత్నూర, డిసెంబర్ 1: అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి గ్రామాల్లో ఎక్కడచూసినా ఎన్నికల వాతావరణం కనిపించింది. పోటీ చేయబోయే అభ్యర్థుల మొదలు ఏ పార్టీ నుంచి ఎవరెవరు బీఫామ్ దక్కించుకుంటారన్న చర్చలు తీవ్రంగా కొనసాగాయి. ఎవరికి ఏ పార్టీ బీఫామ్ ఇస్తుంది, ఏఅభ్యర్థి గెలుపొందుతాడు అనే చర్చ ప్రజల్లో తీవ్రంగా కొనసాగింది. తమ పార్టీ ఫలానా అభ్యర్థిని నిలబెడితే గెలుస్తాడని, తమ పార్టీ తాము సూచించిన అభ్యర్థిని నిలబెడితే మాత్రమే ప్రజల్లో ఉన్న ఆదరణతో గెలుపొందుతాడని చర్చించుకోవడం కనిపించింది. ప్రధాన పార్టీలతోపాటు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ వేసిన వెంటనే తమతమ బల నిరూపన చూపెట్టుకోవడం కోసం సభలు, సమావేశాలు నిర్వహిస్తూ ప్రజల ఓట్లను తమవైపు తిప్పుకోవడానికి తీవ్రంగా ప్రయత్నాలు చేశారు. ఉదయం లేచిందిమొదలు అర్ధరాత్రి వరకు నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో ప్రజల్లో తిరుగుతూ ఎవరికివారు తమ పార్టీ నిలబెట్టిన అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని తిరగడంతో ఒక్కసారిగా గ్రామాల్లో ఎన్నికల వాతావరణం వేడెక్కిపోయింది.

**నామినేషన్ నుంచి పోలింగ్ వరకు**

నామినేషన్లు వేసిన నాటి నుంచి పోలింగ్ ముగిసేవరకు గ్రామాల్లో ఓటర్లను తమవైపు తిప్పుకోవడానికి ప్రధాన పార్టీలతోపాటు స్వతంత్ర అభ్యర్థులు విశ్వ ప్రయత్నాలు చేశారు. దీంతో గ్రామాల్లో ఎక్కడచూసినా, ఎవరిని పలకరించినా ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపోటములపైనే చర్చలు కొనసాగించారు. కొన్నిచోట్ల ఏపార్టీ అభ్యర్థి మంచి మర్యాదలు చేస్తే ఆపార్టీ వెంట ఓటర్లు కనబడ్డారు. వారిని తమ వైపునకు తిప్పుకోవడం కోసం మరోపార్టీ నాయకులు ప్రయత్నాలు చేయడం ఎన్నికల సమయంలో సాధారనమైపోయింది. ఎన్నికల ప్రచారం నిర్వహించడానికి వచ్చిన ఎమ్మెల్యే అభ్యర్థులను ఓటర్లు ఒక సమూహంగా ఏర్పడి తమకు ఫలానా హామీ ఇవ్వాలని అలాగైతేనే తమ మద్దతు మీకే ఇస్తామని కండిషన్లు పెట్టడం.. దానికి ఆ ఎమ్మెల్యే అభ్యర్థులు గెలిచిన వెంటనే మీ కోరిక నెరవేరుస్తానని హామీ ఇవ్వడం ప్రచారంలో ఓభాగమైపోయింది.

**మూగబోయిన పాట**

అభ్యర్థులు ఓటర్లను తమవైపు తిప్పుకోవడం కోసం ప్రచార నిమిత్తం ఏర్పాటు చేసిన ప్రచార వాహనాల పాటల సందడి అంతా ఇంతా కాదు. అభ్యర్థుల రాజకీయ చరిత్రతోపాటు కుటుంబ నేపథ్యంపై రాయించినపాటలు ఓటర్లను ఆకట్టుకోవడంలో ప్రధాన పాత్ర పోషించాయి. ప్రచార వాహనాలు గ్రామాల్లో తిరిగినప్పుడల్లా పెద్ద సందడిగా ఉండేది. ముఖ్యంగా గ్రామాల్లోని చావిడిలు, రచ్చబండలు, హోటళ్లు, కల్లు దుకాణాలు, కుల సంఘాల భవనాలు తదితర స్థలాల్లో ప్రజలంతా ఒకచోట చేరి ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపోటములపై ముచ్చట్లతో ఆ ప్రాంతమంతా సందడిగా ఉండేది. నిన్నటివరకు ఎన్నికల హడావిడి కొనసాగిన గ్రామాల్లో పోలింగ్ ముగిసిన తర్వాత ఎవరి పనుల్లో వారు నిమగ్నం అయ్యారు. దీంతో గ్రామాల్లో ఒక్కసారిగా చడీచప్పుడు లేకుండా పోయింది. ఇక అభ్యర్థుల గెలుపోటములపై అక్కడక్కడా చర్చించడం, సోషల్‌మీడియా, వాట్సాప్‌లలో చర్చించడం కనిపించింది.

**ఫలితాల కోసం ఎదురుచూపులు**

నిన్నటివరకు ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపు కోసం రాత్రింబవళ్లు కష్టపడ్డ నాయకులు, కార్యకర్తలతోపాటు ప్రజలు ఆదివారం వెలువడబోయే ఎన్నికల ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు. ఎవరికివారు తమ అభ్యర్థి గెలుపొందుతాడని ధీమా వ్యక్తం చేస్తూ ఫలితాలకోసం వేచిచూస్తున్నారు. ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో ఫలితాలు ఏవిధంగా వస్తాయి, ఏపార్టీకి ఎంత మెజార్టీ వస్తుంది, ఎవరు గెలుపొందుతారన్నదే ప్రస్తుతం గ్రామాల్లో ప్రధాన చర్చగా మారింది.

## చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మహిళ మృతి

నిజాంపేట, డిసెంబర్: పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందిన ఘటన రజాక్‌పల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రజాక్‌పల్లి గ్రామానికి చెందిన బక్కోల్ల మల్లవ్వ(41) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ తీవ్ర మనస్తాపంతో గురువారం పొలం వద్ద పురుగుల మందు తాగింది. ఇది గమనించిన స్థానిక రైతులు మల్లవ్వను సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలు కొడుకు మల్లేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

## రేపే ఓట్ల లెక్కింపు

- కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్
- మద్యం దుకాణాలు బంద్

సిటీబ్యూరో, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): ఓట్ల లెక్కింపు సందర్భంగా ఆదివారం కేంద్రాల వద్ద ఆంక్షలు విధిస్తూ నగర పోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్య, రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఆంక్షలు 3వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 4వ తేదీ ఉదయం 6 గంటల వరకు అమలులో ఉండనున్నాయి. కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. నిషేధిత కర్రలు, లాఠీలు, పేలుడు పదార్థాలు, ఆయుధాలతో తిరగడం నిషేధమని, గుంపులుగా ఐదుగురి కంటే ఎక్కువగా తిరగకూడదని, పబ్లిక్ ప్లేసెస్‌లో మైకులు, మ్యూజిక్ సిస్టమ్, ప్రసంగాలు చేయడం, నిషేధిత ఫొటోలు, సింబల్స్, ప్లకార్డులు, రెచ్చగొట్టే ప్రసంగాలపై నిషేధాజ్ఞలు విధించారు. విధుల్లో ఉన్న పోలీసు, మిలటరీ, ఎలక్షన్ అధికారులకు మినహాయింపు ఉంటుంది. రోడ్డు, బహిరంగ ప్రదేశాల్లో టపాసులు కాల్చడంపై నిషేధం విధించారు. ఆదివారం మద్యం దుకాణాలను మూసివేయాలని సీపీ ఆదేశాలు జారీ చేశారు.

# బీఆర్‌ఎస్‌దే హ్యాట్రిక్ గెలుపు



పోతులబొగుడలో ఓటింగ్‌పై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

- బీఆర్‌ఎస్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్
- ఓటింగ్ సరళిపై సమీక్ష

అందోల్, డిసెంబర్ 1: పోలింగ్ సరళిపై అందోల్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. రెండు నెలలుగా ప్రచారం, 30న ఎన్నికలు ముగియడంతో శుక్రవారం పోతులబొగుడలోని ఎమ్మెల్యే నివాసంలో కుటుంబసభ్యులతో కొద్దిసేపు గడిపిన ఎమ్మెల్యే.. ఆ తర్వాత వివిధ మండలాల నుంచి వచ్చిన పార్టీ నేతలతో ముచ్చటించారు. పోలింగ్ ఎలా జరిగింది.. ఎక్కడ ఎక్కువ ఓట్లు నమోదయ్యాయి, ఎక్కడ తక్కువ ఓటింగ్ పర్సెంటేజీ వచ్చింది, గతంలో పోలింగ్‌శాతం, ఇప్పటి పోలింగ్ శాతం తదితర విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అభివృద్ధి చేసిన పార్టీకే మరోసారి పట్టం కడుతారన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో అన్ని వర్గాలకు ఆమోదయోగ్యమైన ఎన్నో పథకాలు అమలయ్యాయని, ప్రజలు సీఎంపై నమ్మకాన్ని నిలబెట్టారన్నారు. ప్రభుత్వం చేపట్టిన పనులు, వచ్చే ప్రభుత్వంలో చేపట్టబోయే పనులకే ప్రజలు ప్రాధాన్యం ఇచ్చారన్నారు. కాంగ్రెస్ మాటలను విశ్వసించలేదని చెప్పారు. ఎగ్జిట్‌పోల్స్ పేరుతో కొంతమంది అసత్య ప్రచారం చేస్తున్నారని, పార్టీ శ్రేణులు, ప్రజలు వాటిని నమ్మవద్దన్నారు. పార్టీ కోసం ప్రతీ ఒక్కరు ఎంతో కష్టపడ్డారని, అందరికి కృతజ్ఞతలు తెలిపారు. అందరి కష్టం ఫలితంగానే జిల్లాలోనే అందోల్‌లో అత్యధికంగా పోలింగ్ నమోదైందన్నారు. పోలింగ్ పెరిగేందుకు, పార్టీ గెలుపుకోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు జైపాల్‌రెడ్డి, వరం చైర్మన్ వీరారెడ్డి పాల్గొన్నారు.

# ఈ నెల 11 వరకు 'ఓపెన్'లో అడ్మిషన్లు

సంగారెడ్డి, డిసెంబరు 1: ఉమ్మడి మెదక్ జిల్లాలో ఓపెన్ స్కూల్ విధానంలో 2023–24గాను పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో అడ్మిషన్ పొందేందుకు ఈనెల 11 వరకు గడువు ఉన్నదని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అభ్యాసకులు మండలంలోని అధ్యయన కేంద్రాల్లో సంప్రదించి, ధ్రువపత్రాలు సమర్పించి, అడ్మిషన్ ఫారం పొందాలన్నారు. అడ్మిషన్లు ఖచ్చితంగా ఆన్‌లైన్ విధానంలో తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం వెబ్‌సైట్ www. telanganaopen school.org లో మాత్రమే నమోదు చేయాలని తెలిపారు. అడ్మిషన్ ఫీజు టీఎస్ ఆన్‌లైన్, మీ సేవ కేంద్రాల్లో చెల్లించి రశీదు పొంది అధ్యయన కేంద్రాల్లో అడ్మిషన్ ఫారం ప్రింట్‌తో సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అడ్మిషన్ ఫీజు ఆన్‌లైన్‌తో చెల్లించిన తర్వాత వారి సెల్ ఫోన్లకు పూర్తి సమాచారం వస్తుందని తెలిపారు. అధ్యయన కేంద్రాల కోఆర్డినేటర్లు(ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపల్స్), మండల విద్యాధికారులు, ఉపాధ్యాయ సిబ్బంది విస్తృత ప్రచారం చేసి అభ్యాసకులు అధికసంఖ్యలో అడ్మిషన్లు పొందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వివరాలకు జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ వెంకటస్వామి(80084 03635)ని సంప్రదించాలని సూచించారు. అభ్యాసకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

KIDNEY STONES
★ మూత్ర పిండాల్లో రాళ్ల సమస్యకు ఆపరేషన్ లేని హోమియో పరిష్కారం. 47 సం||, అనుభవంతో 100% గ్యారంటీ. జయసూర్య హోమియో క్లినిక్ A Centre for Kidny Stones Opp: రైల్వే డిగ్రీ కాలేజ్, మెట్రో పిల్లర్ నెం. 1058, తార్నాక, సికింద్రాబాద్. Ph: 9866007924, 9550336677, 040-27000580.
NT-320707

WANTED
★ రామకృష్ణ గ్రూప్ (AP, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. వృద్ధుల/పేషెంట్ల సేవకు వర్కర్లను 24x7 మీ ఇంటికి పంపగలము. 9281452762, 9515108830.
NT-314461

★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-314353-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.